సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 9 । సెప్టెంబర్ । 2022



రెస్టారెంటులో కల్తీ, నిల్వ ఆహారంపై ఫిర్యాదు

- విచారణ జరిపిన అధికారులు
- ఆహార నమూనాల సేకరణ
- రెస్టారెంట్ సీజ్

II లో



వ్యాధులు ప్రబలకుండా చర్యలు

గిరిజన గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌వో సుజాత సూచించారు.

II లో

నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం చేసే కాంట్రాక్టర్లకు ఉద్వాసన



ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం వహించే కాంట్రాక్టర్లను తొలగించి వేరే వారికి ఆ పనులు అప్పగించాలని పాడేరు ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు.

II లో

ఉద్యమంలా అభివృద్ధి నినాదం

- ఏవోబీలో తగ్గుతున్న మావోయిస్టుల ప్రాబల్యం
- వ్యూహాత్మకంగా పోలీసుశాఖ అడుగులు



జక్కం ప్రాంతంలో స్వాధీనం చేసుకున్న డంప్‌లోని పేలుడు సామగ్రిని చూపిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్



డీఐజీ హరికృష్ణ సమక్షంలో లొంగిపోయిన 60 మంది మావోయిస్టు సభ్యులు, మిలీషియా సభ్యులు(ఫైల్)

సాక్షి,పాడేరు: ఏవోబీ వ్యాప్తంగా గిరిజనులు అభివృద్ధిని కోరుకుంటున్నారు. మావోయిస్టుల వల్లే తమ గ్రామాల్లో కనీస సౌకర్యాలు కరవయ్యాయని భావిస్తున్న ఆదివాసీలు క్రమంగా వారికి దూరమవుతున్నారు. మరోవైపు ప్రభుత్వాలు ఉద్యమంలా అభివృద్ధి పనులు చేపడుతున్నాయి. మారుమూల ప్రాంతాలకు రోడ్లు, రవాణా సౌకర్యాలు మెరుగుపడుతుండడంతో పాటు మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయి. ఒడిశా,ఆంధ్రా ప్రభుత్వాలు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాయి. ఇంకో వైపు పోలీసు యంత్రాంగం మూడేళ్ల నుంచి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తూ మారుమూల గ్రామాల్లో గిరిజనుల అభివృద్ధి నినాదాన్ని విస్తృతం చేసింది. ఒడిశాలోని పోలీసు బలగాలతో జిల్లాలోని పోలీసు యంత్రాంగం సమన్వయం చేసుకుని చర్యలు తీసుకుంటూ మావోయిస్టుల చర్యలకు అడ్డుకట్ట వేయగలిగింది. మారుమూల పల్లెల ప్రజలు కూడా కనీస సౌకర్యాలు, అభివృద్ధి కోరుకుంటున్నారని, దీంతో మావోయిస్టుల ప్రాబల్యం రానురాను తగ్గుతోందని పోలీసు యంత్రాంగం భావిస్తోంది.

లొంగుబాట్లతో మరింత దెబ్బ

మావోయిస్టుల సభలు, సమావేశాలకు గిరిజనులు పెద్దగా హాజరుకావడం లేదని సమాచారం. గత రెండేళ్లలో మావోయిస్టు పార్టీ నేతలు, సభ్యులు, మిలీషియా సభ్యుల లొంగుబాట్లతో ఆ పార్టీకి మరింత దెబ్బతగిలింది. మావోయిస్టు కీలక నేత ఆర్‌కే అనారోగ్యంతో మృతి చెందిన నాటి నుంచి మావోయిస్టు పార్టీకి ఏవోబీలో రోజు రోజుకీ ఆదరణ తగ్గుతోందని పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం మావోయిస్టు నేతలు చలపతి, అరుణ, గణేష్‌లు మావోయిస్టు ఉద్యమాన్ని నడుపుతున్నప్పటికీ సురక్షిత ప్రాంతానికే పరిమితమయ్యారని తెలుస్తోంది. పెదబయలు ఏరియా కమిటీ పరిధిలోని 60 మంది పార్టీ సభ్యులు, మిలీషియా సభ్యులు జూన్ 28న పాడేరు ఎస్పీ కార్యాలయంలో డీఐజీ హరికృష్ణ సమక్షంలో లొంగిపోయారు. మావోయిస్టు సభ్యుడు ప్రభాకర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మే నెలలో మావోయిస్టు కీలక నేత కొర్ర నాగేశ్వరరావు, సభ్యుడు సీందేరి జగన్‌లను పోలీసులు అరెస్టు చేశారు. అంతకు ముందు పెదబయలు ఏరియా కమిటీకి చెందిన కీలక నాయకుడు సుధీర్ తన భార్యతో కలిసి పోలీసు అధికారుల ఎదుట లొంగిపోయాడు. ఒడిశాలోని మల్కన్‌గిరి, కోరాపుట్ జిల్లాల పరిధిలో కూడా మావోయిస్టు సభ్యులు లొంగుబాట్లు అధికంగానే ఉన్నాయి.

అమరవీరుల వారోత్సవాలకు దూరం

ఏవోబీలో ఆగస్టులో నిర్వహించిన మావోయిస్టు **అమరవీరుల వారోత్సవాలకు మావోయిస్టు పార్టీ నేతలు, సభ్యులు దూరంగా ఉన్నారు. ఏవోబీ వ్యాప్తంగా ఉన్న అమరవీరుల స్మారక స్థూపాలకు రంగులు వేసేందుకు కూడా ఆయా ప్రాంతాల్లోని మిలీషియా సభ్యులు ముందుకురాలేని పరిస్థితులు** న్నాయని తెలుస్తోందని. ఒడిశాలోని పోలీసు బలగాలతో పాటు అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పోలీసు యంత్రాంగం భారీగా కూంబింగ్ చర్యలు చేపట్టడంతో కొద్దిపాటిగా ఉన్న మావోయిస్టులంతా సురక్షిత ప్రాంతాలకే పరిమితమయ్యారు. చింతూరు సరిహద్దులోని మావోయిస్టు ప్రాబల్యం ఉండడంతో అక్కడ పోలీసుల నిఘా అధికంగా ఉంది. జిల్లాలోని అన్ని మారుమూల ప్రాంతాల్లో పోలీసు కూంబింగ్ కొనసాగుతోంది.

డంప్‌లపై దృష్టి

మావోయిస్టుల డంప్‌ల స్వాధీనంపై పోలీసులు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఓ డంప్‌లో రూ.39లక్షల నగదు లభ్యమైంది. తాజాగా జక్కం ప్రాంతంలో భారీ పేలుడు సామగ్రితో కూడిన డంప్‌ను కూంబింగ్ పార్టీలు స్వాధీనం చేసుకున్నాయి. మరిన్ని డంప్‌లు ఉండవచ్చని భావిస్తున్న పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు.

గిరిజనులు అభివృద్ధిని కోరుకుంటున్నారు : ఎస్పీ



గిరిజనులంతా అభివృద్ధిని కోరుకుంటున్నారని ఎస్పీ సతీష్‌కుమార్ సాక్షికి తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు లేవని, ఆయా ప్రాంతాల్లోని గిరిజనులంతా దుర్భర జీవితం గడుపుతున్నారని చెప్పారు. పోలీసుశాఖ ప్రభుత్వ యంత్రాంగంతో కలిసి మారుమూల గ్రామాల్లో గిరిజనుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటోందని తెలిపారు. రోడ్ల నిర్మాణంతో రవాణా వ్యవస్థను మెరుగుపరుస్తున్నామని, అలాగే సెల్ టవర్లను కూడా ఏర్పాటు చేసి కమ్యూనికేషన్ వ్యవస్థను గిరిజనులకు అందుబాటులో తెస్తున్నామని ఎస్పీ చెప్పారు.

డంప్‌లో భారీగా వెండి నాణేలు

సాక్షి,పాడేరు: జక్కం ప్రాంతంలో స్వాధీనం చేసుకున్న డంప్‌లో భారీగా ఉన్న వెండి నాణేలను చూసి పోలీసు అధికారులు ఆశ్చర్యపోయారు. 1947–50 మధ్య కాలంలో వినియోగంలో ఉన్న వెండి నాణేలు భారీ సంఖ్యలో మావోయిస్టుల డంప్‌లో లభ్యమయ్యాయి. పెదబయలు మండలం జక్కం అటవీ ప్రాంతంలో ఈ నెల 6వ తేదీన స్పెషల్ పార్టీ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలు ఉమ్మడిగా నిర్వహించిన కూంబింగ్‌లో మావోయిస్టుల డంప్‌ను స్వాధీనం చేసుకున్నారు. గతంలో ఇదే ప్రాంతంలో స్వాధీనం చేసుకున్న డంప్‌లో రూ.39లక్షలు నగదు లభ్యమవగా, ఈసారి వెండి నాణేలు పెద్ద సంఖ్యలో వెలుగు చూశాయి. ఈ డంప్‌లో పెద్ద ఎత్తున పేలుడు సామగ్రి, పురాతన వెండి నాణేలు లభ్యమవడం చర్చనీయాంశంగా మారింది. ఒక్కో నాణేం బరువుగా ఉన్నాయి. ఈ డంప్ దాచిన మావోయిస్టుల వివరాలను పోలీసు అధికారులు సేకరిస్తున్నారు. డంప్‌లో ఉన్న విప్లవ సాహిత్యం, ఇతర పుస్తకాల ఆధారంగా పోలీసు అధికారులు సమగ్ర విచారణ చేపడుతున్నట్టు సమాచారం. మావోయిస్టుల డంప్‌లో ఇంత పెద్ద సంఖ్యలో వెండి నాణేలు దర్శనమివ్వడం ఇదే ప్రథమమని పోలీసులు పేర్కొంటున్నారు.



మావోయిస్టుల డంప్‌లో లభ్యమైన వెండి నాణేలు

న్యూస్‌రీల్

ఇద్దరు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు



ఉక్కుర్బ పాఠశాలను సందర్శించిన ఎంఈవో రామచంద్రరావు

హుకుంపేట: మండలంలోని తడిగిరి పంచాయతీ ఉక్కుర్బ పాఠశాల హెచ్‌ఎం గెమ్మెలి బసవన్న, టీచర్ పార్వతమ్మకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు ఎంఈవో రామచంద్రరావు తెలిపారు. గురువారం ఆయన పాఠశాలను తనిఖీ చేశారు. ఆరోగ్యం బాగోలేదని ఆ ఇద్దరు ఉపాధ్యాయులు బుధవారం ముందుగానే పాఠశాల మూసివేసి వెళ్లిపోయినట్టు అందిన సమాచారం మేరకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు చెప్పారు. ఉపాధ్యాయులు సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు. సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యాశాఖ కో–ఆర్డినేటర్ జయరాజ్, సీఆర్‌పీ రత్నం పాల్గొన్నారు.

12 నుంచి గో ఆధారిత ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

కొయ్యూరు: గో ఆధారిత ప్రకృతి వ్యవసాయంపై ఈనెల 12 నుంచి 14 వరకు అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం హరిపురంలో గిరి రైతులకు శిక్షణ ఇవ్వనున్నట్టు బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎరువులు, కషాయాల తయారీపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం 9440567379 అనే ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

ఎటపాకలో మొబైల్ కోర్టు



మెజిస్ట్రేట్ వెంకటేశ్వరరావుతో న్యాయవాదులు

ఎటపాక: మండల కేంద్రం ఎటపాకలో గురువారం సబ్‌డివిజనల్ మెజిస్ట్రేట్ ఆధ్వర్యంలో మొబైల్ కోర్టు నిర్వహించారు. ఈసందర్భంగా సబ్‌డివిజనల్ మెజిస్ట్రేట్ ఎం.వెంకటేశ్వరరావు కక్షిదారులతో మాట్లాడి, కేసుల వివరాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ సత్వరన్యాయసేవలు పొందేందుకు మొబైల్ కోర్టును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ఎం.వి.రమణారావు, గొడపర్తి నాగరాజు,పి.రవి వర్మ సత్యనారాయణ,రాము పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుపై ఏఎస్పీ విచారణ



విలేకరులతో మాట్లాడుతున్న ఏఎస్పీ మహేశ్వరరెడ్డి

రాజవొమ్మంగి: మండలంలోని కింద్ర గ్రామంలో వారం రోజుల కిందట ఇద్దరి వ్యక్తుల మధ్య జరిగిన కొట్లాటపై రంపచోడవరం ఏఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి గురువారం విచారణ జరిపారు. ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసుగా నమోదు కావడంతో విచారణకు వచ్చినట్టు చెప్పారు. రంపచోడవరం ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారిగా రాజవొమ్మంగి, జడ్డంగి స్టేషన్లను సందర్శించి ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, సిబ్బందితో మాట్లాడి, పలు సూచనలు చేశారు. ఎస్‌ఐ టి.గోపీ నరేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

విస్తారంగా వర్షాలు

ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డలు, వాగులు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అనంతగిరి, పాడేరు, లంబసింగి, దారకొండ, మారేడుమిల్లి, మోతుగూడెం, కొయ్యూరు ఘాట్ రోడ్డు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం రాత్రి నుంచి భారీ వర్షం కురిసింది. ప్రధాన గెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గెడ్డల ఆవల ఉన్న గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తం

పాడేరు, రంపచోడవరం రెవెన్యూ డివిజన్ల పరిధిలో భారీగా వర్షాలు కురుస్తుండడంతో రెవెన్యూ యంత్రాంగాన్ని కలెక్టర్ సుమిత్ కుమార్ అప్రమత్తం చేశారు. చింతూరు డివిజన్ పరిధిలో విలీన మండలాలైన కూనవరం, ఎటపాక, వీఆర్‌పురం, చింతూరు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో అధికారులు సహాయక చర్యలకు సిద్ధమవుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో గోదావరికి వరద వచ్చే పరిస్థితుల దృష్ట్యా జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.



అరకులోయలో కురుస్తున్న వర్షం

679.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

జిల్లా వ్యాప్తంగా గురువారం ఉదయం 679.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా రంపచోడవరంలో 122.4, మారేడుమిల్లిలో 116.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. దేవీపట్నం 61.8, వీఆర్‌పురం 60.6, కూనవరం 51.2, అడ్డతీగల 42.2, ఎటపాక 41.2, వై.రామవరం 38.4, జీకే వీధి 20.2, గంగవరం 16.2, ముంచంగిపుట్టు 16.2, కొయ్యూరు 16.2, పాడేరు 16, హుకుంపేట 14.2, పెదబయలు 11, అనంతగిరి 10.4, డుంబ్రిగుడ 8.4, రాజవొమ్మంగి 8.2, చింతూరు 4.6, అరకులోయలో 3.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



వర్షంతో జనసంచారం లేని పాడేరు పాతబస్టాండు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సెంటర్

అరకులోయ రూరల్: మండలంలో గురువారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా కుండపోతగా వర్షం కురిసింది. రోడ్లపైకి భారీగా నీరు చేరడంతో వాహన చోదకులు ఇబ్బందులకు గురయ్యారు.

ఆర్గానిక్ పసుపు, మిరియాలకు మార్కెటింగ్



దొడ్డిపల్లిలో రైతులు సాగుచేస్తున్న పసుపు పంటను పరిశీలిస్తున్న జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి మోహన్‌రావు

- టీటీడీతో సహా 11 దేవాలయాలకు సరఫరా
- జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి మోహన్‌రావు

సాక్షి,పాడేరు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించామని, ఆర్గానిక్ పసుపు, మిరియాలకు మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పిస్తున్నామని జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి బి.మోహన్‌రావు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సంగోడి, కొత్తపల్లి, లగిశపల్లి, దొడ్డిపల్లి ప్రాంతాల్లో గిరిజన రైతులు సాగు చేస్తున్న పసుపు, మిరియాల పంటలను క్షేత్రస్థాయిలో గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన రైతులు రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందుల వినియోగానికి దూరంగా ఉండాలని, ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన ఉత్పత్తులను ప్రజలకు అందించాలని సూచించారు. తిరుమల తిరుపతి దేవస్థానంతో పాటు మరో 11 ప్రధాన దేవాలయాలకు ఆర్గానిక్ పసుపు, మిరియాలను సరఫరా చేస్తే లక్ష్యంతో ఉన్నామన్నారు. ప్రకృతి విధానంలో సాగు చేస్తున్న పంటలకు ఆర్గానిక్ సర్టిఫికెట్లను జారీ చేయించి, గిట్టుబాటు ధరతో మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామన్నారు. గిరిజన రైతులంతా తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు. ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని, రైతులకు మంచి లాభాలు కూడా వస్తాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి సుర్ల రామలింగం, ఎంటీఎస్ సభ్యులు వెంకట్, బొంజుబాబు, చక్రవర్తి, రైతులు పాల్గొన్నారు.

గుడిస హిల్ టాప్ సందర్శనకు గ్రీన్ సిగ్నల్

ఎమ్మెల్యే ధనలక్ష్మి

మారేడుమిల్లి: మండలంలోని పుల్లంగి పంచాయతీ పరిధిలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన గుడిస గ్రాస్‌ల్యాండ్ హిల్ టాప్ సందర్శనకు పర్యాటకులకు అనుమతి లభించిందని, యథావిధిగా రాకపోకలు సాగించవచ్చని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి తెలిపారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. గుడిస హిల్ టాప్ పర్యాటక ప్రదేశం చాలా ఎత్తులో ఉందని చెప్పారు. ఊటీ, లంబసింగి తదితర పర్యాటక ప్రదేశాలకు ఏ మాత్రం తీసిపోకుండా ఈ ప్రాంత అందాలు అద్భుతంగా ఉంటాయన్నారు. దీంతో పలు రాష్ట్రాలు, దూర ప్రాంతాల నుంచి ఇక్కడికి పర్యాటకులు తరలివస్తున్నారని తెలిపారు. అయితే టూరిస్టులు రాత్రి వేళ ఫైర్ క్యాంపులు వేయడం వల్ల అక్కడి పచ్చని గడ్డి, గిరిజనుల కొండపోడు పొలాలు నాశనం అవుతున్నాయని ఐటీడీఏ, ఫారెస్ట్ అధికారులు గుడిసకు రాకపోకలు నిలిపివేశారు. దీంతో పర్యాటకులపై ఆధారపడి జీవిస్తున్న క్యాబ్ డ్రైవర్లు, హోటళ్లు, రిసార్ట్స్, వ్యాపారులు ఏడు నెలలుగా ఉపాధి కోల్పోయారు. ఈ విషయాన్ని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యే ధనలక్ష్మి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆమె చొరవతీసుకుని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరేతో చర్చించారు. స్పందించిన పీవో యథావిధిగా పర్యాటకుల రాకపోకలు సాగించేందుకు అనుమతులిచ్చారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించిన ఎంపీడీవో వివేక్‌ను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సార్ల లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యుడు గొర్లె బాలాజీ బాబు, కో–ఆప్షన్ సభ్యుడు గురుకు ధర్మరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శి గంగరాజు, బలుసుమిల్లి చంటి, సత్తి సునీల్ కుమార్ రెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

రంపచోడవరం ఏరియా ఆస్పత్రి తనిఖీ



ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: స్థానిక ఏరియా ఆస్పత్రిని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రికార్డులు, మందులను పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఆస్పత్రిలో ఎంతమంది సెక్యూరిటీ సిబ్బంది ఉన్నారు, వారి పనితీరు ఎలా ఉందని ఆరా తీశారు. ఎయిడ్స్ వార్డు, బర్త్ వెయిటింగ్ హాలు, బ్లడ్ బ్యాంక్‌ను తనిఖీ చేశారు. మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వీర అబ్బాయి దొర, సాయి, భావన, సతీష్, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు

- పారదర్శకంగా అభివృద్ధి పనులు
- ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ



హాజరైన ఇంజినీరింగ్ అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ, పక్కన పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సచివాలయం పరిధిలో అభివృద్ధి పనుల నిర్వహణకు రూ.20 లక్షల చొప్పున మంజూరు చేసిందని ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ తెలిపారు. గురువారం ఐటీడీఏ సమావేశ మందిరంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మితో కలిసి పాడేరు నియోజకవర్గ పరిధిలోని గిరిజన సంక్షేమ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, ఏపీ ట్రాన్స్‌కో, ఇరిగేషన్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో సచివాలయాల పరిధిలో చేపట్టాల్సిన పనులపై ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ తాగునీరు, సీసీరోడ్లు, మురుగు కాల్వలు, కల్వర్టుల నిర్మాణం, విద్యుత్ సౌకర్యం కల్పన తదితర పనులకు ఈ నిధులను వెచ్చించాలన్నారు. పారదర్శకంగా చేపట్టాలని, సచివాలయాల పరిధిలో అత్యవసర పనులకు మాత్రమే అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పీవో ఆదేశించారు. గ్రామాల్లో మనబడి నాడు–నేడు రెండవ విడత పనులు ప్రారంభించే సమయంలో స్థానిక ప్రజా ప్రతినిధులకు సమాచారం అందించి ఆహ్వానించాలని పీవో ఆదేశించారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారని, గ్రామాల్లో అత్యవసర సమస్యలు పరిష్కారం లక్ష్యంగా సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేశారని ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. సామాజిక పరమైన అవసరాలు తీర్చేందుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులను ఇంజినీరింగ్ అధికారులంతా ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, నాణ్యతా లోపాలు లేకుండా చూడాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం పనులకు సంబంధించిన జాబితాను ఐటీడీఏ పీవోకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ ఈఈ డి.వి.ఆర్.ఎం.రాజు,పంచాయతీ రాజ్ ఈఈ కొండయ్యపడాల్, అన్ని ఇంజినీరింగ్ శాఖ డీఈఈలు, ఏఈఈలు పాల్గొన్నారు.

నవ వధువు అనుమానాస్పద మృతి

- అత్తింటి వారే హత్య చేసి ఉంటారని తల్లిదండ్రుల ఆరోపణ

డుంబ్రిగుడ: ఎన్నో ఆశలతో అత్తింటిలో అడుగుపెట్టిన ఓ నవవధువు పెళ్లి ముచ్చట తీరకుండానే విగతజీవిగా మారింది. అత్తింటివారే హత్య చేసి ఉంటారని మృతురాలి బంధువులు ఆరోపిస్తుండగా, ఆత్మహత్య చేసుకుందని అత్తింటి వారు చెబుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గదబ గల్లుంగు గ్రామానికి చెందిన సంజీవరావుకు ఇప్పటికే వివాహం జరిగింది. మూడు నెలల క్రితం అనంతగిరి మండలం ఎగువ శోభ పంచాయతీ దిగువశోభ గ్రామానికి చెందిన కేత జ్యోతి(29)తో సంజీవరావుకు రెండో వివాహం జరిగింది. కుటుంబ సభ్యుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. జ్యోతి గురువారం శరీరంపై గాయాలతో అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. సంజీవరావు, ఆయన మొదటి భార్య, తల్లిదండ్రులు కలిసి తమ కుమార్తె జ్యోతిని హత్యచేసి ఉంటారని తండ్రి కేత బుద్దు డుంబ్రిగుడ పోలీసు స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆ గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టానికి అరకులోయ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.



అనుమానాస్పదంగా మృతి చెందిన జ్యోతి

చింతపల్లిలో పార్శిల్ సర్వీస్ కేంద్రం

ప్రారంభించిన పాడేరు ఆర్టీసీ డిపో మేనేజర్

చింతపల్లి: వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పార్శిల్ సర్వీస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు పాడేరు ఆర్టీసీ డిపోమేనేజర్ ఆర్.ఎస్. నాయుడు తెలిపారు. పార్శిల్‌కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా ఏర్పడిన తరువాత చింతపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌ను పాడేరులో విలీనం చేశామన్నారు. వినియోగదారులకు మెరుగైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కాంప్లెక్స్‌ను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. బస్సుల రాకపోకలకు సంబంధించిన సమాచారం తెలిపేందుకు పూర్తి స్థాయిలో గైడ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. దుకాణ సముదాయాల నిర్వాహణతో పాటు కంట్రోల్ రూమ్‌ను పక్కాగా నిర్వహిస్తామన్నారు. ప్రయాణికుల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు చేపడతామని ఆయన తెలిపారు.



పార్శిల్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న నాయుడు

మావోయిస్టులకు సహకరించొద్దు

- మంప ఎస్‌ఐ లోకేష్‌కుమార్
- మందులు, వాలీబాల్ కిట్ల పంపిణీ



కోండ్రుంలో పథకాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ మనోజ్‌కుమార్



గిరిజనులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ లోకేష్‌కుమార్

కొయ్యూరు: ఒకప్పటి మావోయిస్టుల అడ్డాలో మంప ఎస్‌ఐ లోకేష్‌కుమార్ పర్యటించారు. గూడెంకొత్తవీధి, కొయ్యూరు మండలాల సరిహద్దు గ్రామాలైన దేవుళ్లబంద, పడమసింగవరం, పుట్టకోట, పీఎల్ కొత్తూరు కాకులమామిడి, జ్యోతులమామిడి, కంతారం, తోట చిలుక బిల్లు పాలెం తదితర గ్రామాలను ఆయన సందర్శించారు. గిరిజనుల సమస్యలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మావోయిస్టులకు ఎవరు సహకరించవద్దని సూచించారు. వారి మూలంగా గతంలో చాలా వరకు అభివృద్ధి నిలిచిపోయిందన్నారు. వారి ప్రభావం తగ్గిపోవడంతో మారుమూల గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. రహదారులు వేస్తే గ్రామాల్లో వసతులు మెరుగుపడి అభివృద్ధి చెందుతాయన్నారు. గంజాయి సాగు, రవాణాకు దూరంగా ఉండాలని సూచించారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడరాదన్నారు. గ్రామస్తులకు వాలీబాల్ కిట్లు, పిల్లలకు చాకెట్లు,పెద్దలకు మందులు పంపిణీ చేశారు.

పెదబయలు: మండలంలోని మారుమూల ఇంజరి పంచాయతీలో మావోయిస్టుల ప్రభావం పూర్తిగా తగ్గిందని ఎస్‌ఐ పులి మనోజ్‌కుమార్ అన్నారు. రెండు రోజుల పాటు మండలంలోని ఇంజరి పంచాయతీ కోంద్రుం,జమదంగి,ననుబరి గ్రామాల్లో ఆయన ఆధ్వర్యంలో కమ్యూనిటీ పోలీసు కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు, సేవలపై ఆయన అవగాహన కల్పించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మందులు పంపిణీ చేశారు. మావోయిస్టుల ప్రభావం లేకపోవడంతో గిరిజన గ్రామాల్లో స్వేచ్ఛాయుత పరిస్థితులు నెలకొన్నాయన్నారు.యువతకు వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. ప్రత్యేక పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులకు నిర్వహిస్తున్న కంటి పరీక్షలు

వై.రామవరం: స్థానిక మండలపరిషత్ కార్యాలయం వద్ద గురువారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరంలో 206 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. సుమారు 40 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కంటి ఆపరేషన్ అవసరమైన 30 మందిని అంబులెన్స్‌లో కాకినాడ అంజు ఆస్పత్రికి తరలించారు. రోగులకు ఉచిత భోజన వసతి, రవాణా సౌకర్యం కల్పించారు. సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో కాకినాడ అంజు కంటి ఆస్పత్రి సహకారంతో నిర్వహించారు. వైద్యాధికారులు ప్రసాదు, నాని, ఇమ్రాన్, మేనేజర స్వామి, శ్రీసత్యసాయిసేవా సమితి మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సమితి వైద్యవిభాగం కన్వీనర్ సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ శిబిరంలో మండలసేవాసమితి కన్వీనర్ పల్లాల వెంకటరమణారెడ్డి, గ్రామపెద్ద గొర్లె శ్రీకాంత్, ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేతలు కరణం కనకరాజు అతిథులుగా విచ్చేశారు.

‘సంక్షేమం’ దేశానికే ఆదర్శం

- రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి
- పెద్ద గెద్దాడ పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహణ
- సమస్యలు విన్నవించిన స్థానికులు



పెద్దగెద్దాడలో గిరిజనులకు ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

రంపచోడవరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని పెద్ద గెద్దాడ పంచాయతీ పరిధిలో చెరువుపాలెం, డొంకులపాడు పెద్దపాడు, గ్రామాల పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఆమె నిర్వహిచారు. పెద్దగెద్దాడలో 30 మంది గిరినులకు ఇళ్ల పత్రాలను పంపిణీచేశారు. 250 గడపలను ఆమె సందర్శించారు. మహిళాలు పూలమాలలతో హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. ప్రతి గడపకు తిరిగి యోగక్షేమాలు తెలుసుకున్నారు. పథకాల గురించి వివరించి, కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కూడా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బంధం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, ఎంపీటీసీ ఉలవల లక్ష్మి, రంపచోడవరం, పెద్ద గెద్దాడ సర్పంచ్‌లు మంగా బోజ్జయ్య, వడగల ప్రసాద్, నాయకులు పండా రామకృష్ణ, కాపరావు రౌతు, పాచమ్మ, రత్నరాజు, కాంతం పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలపై పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో డాక్టర్ రమేష్, ఇతర ఉపాధ్యాయులు

సాక్షి,పాడేరు: సార్వత్రిక విద్యాపీఠం నిర్వహిస్తున్న ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు సంబంధించిన అడ్మిషన్ డ్రైవ్ ప్రచార పోస్టర్‌ను డీఈవో డాక్టర్ పి.రమేష్ గురువారం ఆవిష్కరించారు. స్థానిక పీఎంఆర్సీ సమావేశ మందిరంలో జిల్లాలోని పలు సెంటర్లకు సంబంధించిన హెచ్‌ఎంలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాల పోస్టర్‌ను ఆవిష్కరించి జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం చేయాలని, అడ్మిషన్లు పెద్ద ఎత్తున చేపట్టాలని డిఈవో కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు రీమలి జాన్, జి.పుష్ప పాల్గొన్నారు.

మేలైన యాజమాన్యంతో అధిక దిగుబడి



యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ ఇస్తున్న కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలు

గూడెంకొత్తవీధి: మేలైన యాజమాన్య పద్ధతిలో వరి సాగు చేపడితే అధిక దిగుబడులు సాధ్యమని బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం క్షేత్రీయ శాస్త్రవేత్త డాక్టర్ వాన ప్రసాదరావు సూచించారు. లొద్ది మంగలపాలెంలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వరిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరుసలో నాట్లు వేసుకున్న పొలాల్లో సహజంగానే చీడపీడల వృద్ధి తక్కువగా ఉంటుందన్నారు. చిక్కునాట్లు వేయకుండా ఈ నెలలోపు కాలిబాట తీసుకుంటే ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పొలాల్లోనే కాకుండా గట్లపై కూడా ఎటువంటి గడ్డి, కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలని సూచించారు. తద్వారా చీడపీడల నివారించుకోవచ్చన్నారు. సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ బండి నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ వరిలో ఆకు ముడత, పీక పురుగులు అక్కడిక్కడే కనిపించినప్పటికీ తొందరపడి మందులు పిచికారి చేయాల్సిన అవసరం లేదన్నారు. సాలె పురుగులు, తూనీగ వంటి మిత్ర పురుగులు ఎక్కువగా ఉన్నప్పుడు రసాయనాలు పిచికారి వాయిదా వేయాలని సూచించారు. అగ్గి, పొడ తెగులు సోకిన సోకిన వెంటనే తగిన మందులు పిచికారి చేసుకోవాలన్నారు. లేనిపక్షంలో వర్షాలతో తెగులు వృద్ధి చెందుతుందన్నారు. కొన్ని చోట్ల ప్రారంభ దశలో ఉన్న అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ పొడిమందు 120 గ్రాములు పిచికారీ చేసుకోవాలని ఆయన సూచించారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త దివ్యసుధ, రైతులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు చెల్లించాలని కలాసీల వినతి



ట్రైకార్ చైర్మన్ బుల్లిబాబుకు వినతిపత్రం అందజేస్తున్న జీసీసీ కలాసీల సంఘ ప్రతినిధులు

సాక్షి,పాడేరు: జీసీసీలో గత 25 నుంచి 30ఏళ్ల నుంచి పనిచేస్తున్న జీసీసీ కళాశీలందరికి కనీస వేతనాలు రూ.20వేలు అమలు చేయాలని, ఇతర ప్రభుత్వ రాయితీలు వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబును ఆ సంఘ నేతలు గురువారం కోరారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వంతాల పండుబాబు, ఇతర ప్రతినిధులంతా ట్రైకార్ చైర్మన్‌ను కలిసి తమ సమస్యలు వివరించారు. అనంతరం వినతిపత్రం అందించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని బుల్లిబాబు హామీ ఇచ్చారు.

కులదూషణ కేసులో డీఎస్పీ విచారణ

కశింకోట: కశింకోటలోని అగ్రహారం వీధిలో కుల దుషణ కేసుపై అనకాపల్లి డీఎస్పీ సునీల్ గురువారం విచారణ జరిపారు. అగ్రహారంలో ఎఆర్‌టీ శర్మ ఇంట్లో అద్దెకు నివాసం ఉంటున్న ప్రభుదాస్‌ను బుధవారం కలిసి తన యజమాని ఇల్లు మరమ్మతులు చేపట్టడానికి నిర్ణయించినందున దీన్ని ఖాళీ చేయాలని కోడి తాతారావు కోరాడు. ఈ నేపథ్యంలో తనను కులం పేరుతో దూషించి దౌర్జన్యం చేశాడని తాతారావు పోలీసులకు ప్రభుదాస్‌పై ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో డీఎస్పీ వచ్చి విచారించారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

డీఎంహెచ్‌వో సుజాత



మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుజాత

రంపచోడవరం: గిరిజన గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌వో సుజాత సూచించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పీహెచ్‌సీలకు వచ్చే రోగులకు ముందుగా వైద్య, రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందజేయాలని సూచించారు. వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. గర్భిణుల్లో రక్తహీనత నివారణకు మందులు అందజేయాలన్నారు. దగ్గు బారిన పడిన వారికి టీబీ పరీక్షలు చేయాలని సూచించారు. పీహెచ్‌సీ సిబ్బంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన నిధుల ఖర్చు వివరాలను నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీసీవో డాక్టర్ విశ్వేశ్వర నాయుడు, ఏడీఅండ్‌హెచ్‌వో డాక్టర్ అనూష, డిప్యూటీ డెమో అధికారి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు ప్రక్రియ వేగవంతం



కుమ్మూరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నందు

చింతూరు: విలీన మండలాలైన చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లో ఈ పంట నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్ నందు ఆదేశించారు. గురువారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో నాలుగు మండలాల వ్యవసాయాధికారులు, సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పంటనమోదులో భాగంగా తప్పులు లేకుండా రైతుల పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, పంటనమోదు వల్ల కలిగే లాభాలపై రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు రైతులకు సకాలంలో అందేలా సిబ్బంది కృషి చేయాలని ఆయన సూచించారు. రైతుభరోసా పథకానికి సంబంధించి కొత్త రైతులెవరైనా వుంటే వారిని గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆయన ఆదేశించారు. అనంతరం మండలంలోని కుమ్మూరులో క్షేత్రస్థాయిలో ఈ పంటనమోదు ప్రక్రియను ఆయన పరిశీలించి రైతులకు పంటనమోదు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కుమ్మూరు రైతుభరోసా కేంద్రంలో రైతులకు ఆయన ఎరువుల పంపిణీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి రమేష్‌బాబు, ఏడీఏ కేవీ చౌదరి, వ్యవసాయాధికారులు కృష్ణకాంత్, రఘుకుమార్, రాబిన్ సుదర్శన్, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం చూపే కాంట్రాక్టర్లకు ఉద్వాసన

ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

సాక్షి, పాడేరు: ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం వహించే కాంట్రాక్టర్లను తొలగించి వేరే వారికి ఆ పనులు అప్పగించాలని పాడేరు ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు, ఎంపీడీవోలు, సర్పంచులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో గురువారం సమావేశం నిర్వహించారు. రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీల పనుల పురోగతిపై సచివాలయాల వారీగా పీవో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్లకు రెండు,మూడు రోజుల్లో బిల్లులు చెల్లించనున్నట్టు చెప్పారు. ఇప్పటికే ఎఫ్‌టీవోలు జనరేట్ చేసినట్టు తెలిపారు. బిల్లులు పొంది కూడా పనులు చేయకపోతే అలాంటి కాంట్రాక్టర్లను గుర్తించి, బ్లాక్ లిస్టులో పెడతామన్నారు. అటువంటి కాంట్రాక్టర్ల తొలగింపునకు సంబంధించి గ్రామసభల్లో తీర్మానాలు జరపాలని సూచించారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేందుకు ఎంపీడీవోలు, సర్పంచులు చొరవ చూపాలని తెలిపారు. భవన నిర్మాణాలకు సిమెంట్ కొరత లేదని, మారుమూల ఇంజరి, జామిగుడ పంచాయతీల్లో ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలకు శంకుస్థాపన కూడా చేశామని చెప్పారు. నిర్దేశించిన సమయానికి పనులు పూర్తి చేయాలని పీవో ఆదేశించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు మాట్లాడుతూ డిసెంబర్ నెలాఖరు నాటికి రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాల భవన నిర్మాణాలు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఈఈ కొండయ్యపడాల్ తదితరులు పాల్గొన్నారు.

రెస్టారెంటులో కల్తీ, నిల్వ ఆహారంపై ఫిర్యాదు

- విచారణ జరిపిన అధికారులు
- ఆహార నమూనాల సేకరణ
- రెస్టారెంట్ సీజ్



ఆహార నమూనాలను సేకరిస్తున్న అధికారులు



రెస్టారెంట్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

ముంచంగిపుట్టు: గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని నిల్వ ఉంచిన మాంసం, కల్తీ ఆహారం అమ్మకాలు చాపకింద నీరులా సాగుతున్నాయి. ఇటీవలే కొందరు ఈ విషయం గుర్తించడంతో స్థానికులు అప్రమత్తమై ఓ రెస్టారెంట్‌లో కల్తీ ఆహారం,నిల్వ ఉంచిన మాంసాన్ని పట్టుకున్నారు. అధికారులకు సమాచారం ఇచ్చారు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలో ఎస్.వసంతకిషోర్ అనే వ్యాపారి స్పైసి విలేజ్ అనే పేరుతో రెస్టారెంట్‌ను ఎనిమిది నెలల క్రితం ప్రారంభించారు. వివిధ స్పెషల్ వంటకాలతో రెస్టారెంట్‌ను నిర్వహిస్తున్నారు. ఇటీవల కాలంలో రెస్టారెంట్ ద్వారా నిల్వ, కల్తీ ఆహారం అందిస్తున్నట్టు ఆరోపణలు వచ్చాయి. స్థానిక వర్తక సంఘం అధ్యక్షుడు ఎస్.ప్రసన్నకుమార్, గిరిజన ఉద్యోగ సంఘం నేతలు, జేఏసీ నేతలు, స్థానికులు సమక్షంలో అధికారులు రెస్టారెంట్‌ను తనిఖీ చేశారు. ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన పచ్చి మాంసంతో పాటు వండి మిగిలిపోయిన ఆహారాన్ని గుర్తించారు. తహసీల్దార్ నర్సమ్మ, ఎంపీడీవో ఎ.వి.వి.కుమార్ సమక్షంలో రెవెన్యూ, పంచాయతీ అధికారులు రెస్టారెంట్ నిర్వాహకుడు వసంతకిషోర్‌ను, ఫిర్యాదుదారులు ప్రసన్నకుమార్, ఉదయ్‌కుమార్, రవికుమార్‌లను విచారణ చేసి వివరాలు నమోదు చేసుకున్నారు. రెస్టారెంట్ నిర్వహణకు ఎటువంటి అనుమతి లేదని గుర్తించారు. ఆహార నమూనాలను ఫుడ్ అధికారుల పరీక్షల నిమిత్తం సేకరించారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆదేశానుసారంగా రెస్టారెంట్‌ను సీజ్ చేశారు. తహసీల్దార్ నర్సమ్మ మాట్లాడుతూ రెస్టారెంట్‌పై కల్తీ ఆహారం, నిల్వ మాంసం ఆరోపణలు రావడంతో తనిఖీ చేసి, విచారణ జరిపించామని, ఆహార నమూనాలను పరీక్షల నిమిత్తం పంపిస్తున్నామని, రిపోర్టు వచ్చేంతవరకు రెస్టారెంట్‌ను సీజ్ చేస్తున్నామని తెలిపారు. ఎంపీపీ సీతమ్మ, వైస్ ఎంపీపీ భాగ్యవతి, సర్పంచ్ సుభాష్‌చంద్ర తదితరుల సమక్షంలో రెస్టారెంట్‌ను సీజ్ చేశారు.

ఇద్దరు ఉపాధ్యాయులపై ఫిర్యాదు

కొయ్యూరు: ఇద్దరు ఉపాధ్యాయులు విధులకు సక్రమంగా రావడం లేదని గురువారం ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్, ఎంఈవో బోడంనాయుడులకు మండల పరిషత్ సమావేశంలో ఎంపీటీసీలు ఫిర్యాదు చేశారు. బూదరాళ్ల పంచాయతీ వంతమర్రి సీఆర్టీ వారానికి ఒకసారి విధులకు వస్తున్నారని అక్కడ ఎంపీటీసీ కుమారి అధికారుల దృష్టిలో ఉంచారు. అదే విధంగా చింతవానిపాలెం ఉపాధ్యాయులు సరిగా రావడం లేదని ఎంపీటీసీ కె.మల్లికార్జున్ తెలిపారు.

1032 కిలోల గంజాయితో ఒకరి అరెస్టు



గంజాయితో పట్టుబడిన వ్యాన్‌తో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

సాక్షి, పాడేరు: పెదబయలు మండలం మారుమూల ప్రాంతం నుంచి వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం సాయంత్రం చింతలవీధి జంక్షన్ వద్ద పట్టుకున్నారు. బొలేరో వ్యాన్‌లో మైదాన ప్రాంతానికి ఈ గంజాయిని తరలిస్తున్నట్టు టాస్క్‌ఫోర్స్ సీఐ కూర్మారావు తెలిపారు. 1032 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని వ్యాన్ సీజ్ చేసామని ఆయన తెలిపారు. గంజాయి రవాణాకు పాల్పడిన పెదబయలు మండలం కిముడుపల్లి పంచాయతీ చేదుపుట్టు గ్రామానికి చెందిన కిల్లో హరికృష్ణను అరెస్టు చేసామని, పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.20 లక్షల వరకు ఉంటుందని సీఐ తెలిపారు.

రాజకీయ ఖైదీలను బేషరతుగా విడుదల చేయాలి

మావోయిస్టు నేత అరుణ డిమాండ్



మావోయిస్టు ప్రకటన

జి.మాడుగుల: ఈ నెల 13న జతిన్ దాస్ వర్ధంతిని రాజకీయ ఖైదీల హక్కుల పోరాట దినంగా పాటించాలని, జైళ్లల్లో రాజకీయ ఖైదీల పోరాటానికి సంపూర్ణ మద్దతును తెలియజేయాలని విశాఖ-అల్లూరి, అనకాపల్లి డివిజన్ భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) పిలుపునిచ్చింది. స్థానిక విలేకర్లకు గురువారం సీపీఐ మావోయిస్టు కార్యదర్శి అరుణ పేరుతో ప్రకటన అందింది. అన్యాయాలపై పోరాడే శక్తులకు ఆదర్శప్రాయుడైన గొప్ప విప్లవకారుడు జతిన్‌దాస్ అని ఆమె తెలిపారు. కేంద్రంలో హిందుత్వ బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న అణచివేత విధానాలకు తీసిపోకుండా ఏపీలో నిరంకుశంగా ప్రభుత్వం ప్రజా ఉద్యమాలపై ఉక్కుపాదం మోపుతోందని ఆరోపించారు.

విశాఖ జైల్లో ఏవోబి ఎస్సీ మెంబర్ కామ్రేడ్ దామోదర్, ఏరియా కమిటీ సభ్యురాలు పల్లవి, డివిజన్‌లో పెదబయలు, కోరుకొండ ఏరియా కమిటీ సభ్యులు భవానీ, నగేష్, గాలికొండ ఏరియా కమిటీ సభ్యురాలు రామె సుందరావు, అశోక్‌పై వందలాది అక్రమ కేసులు పెట్టి బెయిల్ రాకుండా ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆమె ప్రకటనలో ఆరోపించారు. హక్కుల ఉద్యమకారులను, వివిధ జైళ్లలో ఉన్న రాజకీయ ఖైదీలందరినీ బేషతుగా విడుదల చేయాలని ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు.